క్లుప్తంగా

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మద్దూరు: మండలానికి వచ్చిన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం ఆయా గ్రామాల్లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అందజేయనున్నట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్లెర్లలో 20, మద్దూరులో 15, రెనివట్లలో 18, జాదరావ్‌పల్లిలో 10, దోరేపల్లిలో 23చెక్కులను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మిగిలిన గ్రామాలకు చెందిన చెక్కులను మద్దూరులో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 135మంది లబ్ధిదారులకు ఈ చెక్కులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాగనూర్: మండల పరిధిలోని మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ 33కేవీ పరిధిలోని ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఊట్కూరు: మండలంలోని సీపీఎస్ పాఠశాలలో మంగళవారం తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులుగా ఎంపికైన మోనప్ప, ప్రదీప్, అశోక్, రాణి, మహేష్, భారతి, మాలతికి శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. తపస్ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం పూర్వజన్మ సుకృతమని ఆయన అన్నారు. అరవింద్‌కుమార్, నాయకులు హన్మంతు, హాజమ్మ, యజ్ఞేశ్వర్‌రెడ్డి, నాయకులు నర్సింహ, నర్సింగప్ప, కృష్ణ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గుండ్రాతి గోవర్ధన్‌గౌడ్‌కు రాష్ట్ర స్థాయి ఎక్సలెన్స్ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడంతో మంగళవారం గ్రామ యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థి ప్రముఖ్ దేవేందర్‌గౌడ్, సంజీవ, రమేష్, జగదీష్, చంద్రశేఖర్ శెట్టి, శ్రీనివాసులు, పరుశరాం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



మాగనూర్: రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు మండలంలోని వడ్వాట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపికైనట్లు విశ్రాంత పీఈటీ బి. గోపాలం తెలిపారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు ఈ నెల 20న మక్తల్ మినీస్టేడియంలో నిర్వహించిన పదికిలోమీటర్ల రోడ్డు స్పీడ్ సైక్లింగ్ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారని అన్నారు. వీరు వచ్చేనెల 4నుంచి 6వరకు జనగాం జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం గురురాజారావు, పీడీ రేణుక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బైకులు ఢీ: ముగ్గురికి గాయాలు

మాగనూర్: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి పెట్రోల్‌బంక్ ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలంలోని పెగడబండ గ్రామానికి చెందిన తాయప్ప నల్లగట్టు మారెమ్మవ్వ ఆలయం వద్ద వెళ్తుండగా ఉట్కూర్ మండలం మల్లెపల్లికి చెందిన ఉమేష్ పెట్రోల్‌బంక్ నుంచి బయటకు వస్తున్న క్రమంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో తాయప్పకు గాయాలు కాగా మరో ఇద్దరు బాలికలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని మాగనూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించగా తాయప్పను మెరుగైన వైద్యంకోసం మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మాగనూర్: తక్షణమే సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ... 317జీఓ ద్వారా నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు.

డ్రెయినేజీ లేక అవస్థలు

- రోడ్డు పైనే పారుతున్న మురుగు
- కోతకు గురవుతున్న బీటీరోడ్డు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై పారుతున్న మురుగు



కోతకు గురవుతున్న రోడ్డు

దామరగిద్ద: మండలం కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్లపై మురుగు పారుతుంది. దీంతో ప్రజలు అవస్థల పడుతున్నారు. మురుగు రోడ్లపై నిల్వ ఉండటంతో చుట్టు పక్కన నివసిస్తున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని సంజీవరాయ ఆలయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు రోడ్డు ఇరువైపులా ఇళ్లు ఉండటంతో వాటిని తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. కాగా ఆర్‌అండ్‌బీ నిధులతో చేపట్టిన రోడ్డు కావడంతో ఎస్టిమేషన్‌లో సైడ్ డ్రైన్ లేదని, కాంట్రాక్టర్ కేవలం రోడ్డు మాత్రమే చేపట్టి వదిలేశారు.

కోతకు గురవుతున్న రోడ్డు..

రోడ్డుకు ఇరువైపులా మురుగుకాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇటు ఇళ్ల నుంచి వచ్చే మురుగునీటితో పాటు వర్షాకాలం వచ్చే వృథా నీటితో రోడ్డుకు ఇరువైపులా కాల్వల ఉన్న వచ్చేనీరు పారడంతో రోడ్డు కోతకు గురవుతంది. కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన రోడ్డు కోతకు గురువతున్న ఇటు ఆర్అండ్ అధికారులు అటు పంచాయతీరాజ్ అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

కాల్వల నిర్మాణం చేపట్టాలి..



గతంలో ఉన్న మురుగు కాల్వలు పడిపోయి, మురుగు రోడ్డుపై పారుతుంది. రోడ్డుకు ఇరువైపులా మురుగునిలిచి దుర్వాసన వస్తుంది. వర్షాకాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. స్థానిక నాయకులు చొరవ తీసుకొని కాల్వ నిర్మాణం చేపట్టి సౌకర్యం కల్పించాలి.

– బాల్‌రాజ్, దామరగిద్ద

రోడ్డుపైకి వస్తుంది..



రోడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా.. మురుగునీటి కాల్వ కట్టలేదు. దీంతో రోడ్డుపైకి దాటాలంటే మురుగుకాల్వలో నుంచి నడిచి వెళ్లాలి. డ్రెయినేజీ లేక మురుగునీరు వాకిట్లోకి వస్తుంది. మురుగునీటి కాల్వలు నిర్మించాలి.

– రాములమ్మ, దామరగిద్ద

ఎస్‌డీపీ నిధులు మంజూరు..



మండల కేంద్రంలో ఆర్అండ్ బీరోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 18లక్షల ఎస్‌డీపీ నిధులు కేటాయించారు. మంజూరైన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయితే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. స్థానిక సంజీవరాయ ఆలయం నుంచి పంచాయతీ వరకు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరైనట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

– సాయిలక్ష్మి, ఎంపీడీఓ

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సీఎంఓ



వివరాలు తెలుసుకుంటున్న సీఎంఓ రాజేంద్ర కుమార్

కోస్గి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం సీఎంఓ రాజేంద్రకుమార్ సందర్శించారు. సంగ్రహణాత్మక మూల్యాంకనం–1కొనసాగుతున్న తీరును పరిశీలించారు. పాఠశాలకు సంబంధించిన రిజిష్టర్లను తనిఖీ చేశారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా గతంలో జరిగిన రెండు పరీక్ష పేపర్లను భవిష్యత్‌లో జరిగే పరీక్ష పేపర్లను 6, 9వ తరగతి విద్యార్థులకు వివరించి చివరి పరీక్ష కోసం సిద్ధం చేయాలని సూచించారు. ప్రశస్త్ యాప్‌లో విద్యార్థుల వివరాలు ఈ నెల 24వరకు నమోదు చేయాలన్నారు. స్కూల్ యూనిఫాం వివరాలు సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, యాదయ్య శెట్టి పాల్గొన్నారు.

సంజీవరెడ్డికి సన్మానం



నారాయణపేట: విద్యుత్ శాఖ ఎస్సీగా పదోన్నతి పొందిన సంజీవ రెడ్డిని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ కార్యాలయంలో మంగళవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, నాయకులు బాలప్ప, ప్రభు, శరణయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పుపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రి డా. భవాని ఆధ్వర్యంలో అయోడిన్ ఉప్పుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయోడిన్ లోపించడంతో కలిగే రుగ్మతల గురించి అవగాహన కల్పించడంతోపాటు ఉప్పును పరీక్ష చేసి విద్యార్థులకు చూపించారు. అయోడిన్ పరిమాణం కలిగిన ఉప్పును భుజించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సింహారాజు, వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, గోవిందమ్మ, కవిత, నర్సింహులు, కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు చేపట్టాలి



నారాయణపేట: కోయిలకొండ నుంచి అప్పక్ పల్లి వరకు బీటీ రోడ్డు పనులను చేపట్టాలని డిమాండ్ చేస్తూ (టీయూసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. జిల్లా కార్యదర్శి బి నర్సింహా మాట్లాడుతూ.. ఈ రోడ్డు గుంతల మయం కావడంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామాల్లో ఆరోగ్యం నిమిత్తం జిల్లా కేంద్రానికి రావాలంటే అనేక సమస్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని వారు కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి రాము, జిల్లా సహాయ కార్యదర్శి ఏ. నరసింహ, ఆటో వర్కర్స్, వెంకటప్ప, యూసుఫ్, మల్లేష్, రాజు, కృష్ణయ్య, రాము ఉన్నారు.

పోలీస్ టీంను అభినందించిన ఎస్పీ

నారాయణపేట: ఈ నెల 16 నుంచి 19 వరకు హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్–2024 పోటీల్లో జోగులాంబ జోన్–7 తరుపున జిల్లా నుంచి యాంటి సబ్టెక్ చెక్‌రూమ్ సెర్చ్‌లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రం సాధించిన కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, ఆంజనేయులు, బీడీ టీం ఇన్‌చార్జి బ్రహ్మానందరెడ్డిని ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు. ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ రియాజ్, సీఐ నర్సింహులు అభినందించారు.

కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

నారాయణపేట: ఇందిరమ్మ ఇళ్లను జీపీ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు.. జిల్లా అధ్యక్షుడు ఎదిరింటి నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన్‌పల్లి రాము మాట్లాడుతూ.. జిల్లాలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నర్సింహా, పంచాయతీ కార్మికులు వెంకటయ్య, అనిల్, వెంకటయ్య, కృష్ణ, రాజు తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

మద్దూరు: జర్నలిస్టుల సమస్యల కోసం నిరంతరం పోరాడేది టీయూడబ్ల్యూజే అని, ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించే టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి కోరారు. మంగళవారం జర్నలిస్టులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రఘు, నక్క శ్రీనివాస్, సురేష్, తఖీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



కోస్గిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు



నిడ్జింత ఉన్నత పాఠశాలలో ..

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) పిలుపు మేరకు ఉపాధ్యాయ ధర్మ గ్రహణ్ భాగంగా మంగళవారం కోస్గి మండల పరిధిలోని పలు పాఠశాలలో మధ్యాహ్నభోజన సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను, ఇతర బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిధిలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- దామరగిద్ద మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, విఠలపూర్ పాఠశాలలో తపస్ సభ్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అశోక్, తపస్ సభ్యులు గుంపు బాలరాజు, జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, తిరుపతయ్య, బసిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.
- కృష్ణాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలను ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు.. ఆ సంఘం నాయకులు రామ్మోహన్ మాట్లాడారు.. పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వాలని, పీఆర్సీ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. మండల నాయకులు నర్మద, నర్సింహులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయులు తెలిపారు. మంగళవారం మద్దూరు మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో నిరసన నిర్వహించారు. ఎంఈఓ ఆంజనేయులు, సంఘం నాయకులు వేణుగోపాల్, లాజర్, దేవేంద్రప్ప, విజయ్, నగేష్, రామకృష్ణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.
- పెండింగ్ డీఏ–పీఆర్‌సీ బిల్లులను తక్షణమే పరిష్కరించాలని తపస్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సికిందర్ అన్నారు. మరికల్‌లోని తపస్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తునమన్నారు. ఎంఈఓ మనోరంజని, సురేష్, శ్రీను, రాఘవేందర్, అనిత పాల్గొన్నారు.
- మాగనూర్‌లోని వడ్వాట్ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమంలో చేపట్టారు. ఈ మేరకు.. సంఘం నాయకులు రామ్మోహన్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ నాయకులు నర్సింహులు, నర్మద తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాలో..

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



అధికారి రాంచంద్ర ఆచారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న ఎంఈఓ అనిల్‌కుమార్‌గౌడ్

కృష్ణా: ప్రతి విద్యార్థి కూడా మంచి మార్కులతో పాటు పదోతరగతిలోని విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రాంచంద్ర ఆచారి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను ఎంఈఓ నిజాముద్దీన్‌తో కలిసి సందర్శించారు. ఈ మేరకు.. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.. ప్రధానంగా సమ్మేటివ్ ఎగ్జామ్స్, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే అంశాలపై చర్చించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మురళీమోహన్, అనిల్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు కిశోర్, నాగరాజు, గోపాల్, సీఆర్‌పీ అమీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని కాట్రేవ్‌పల్లి, యర్నాగన్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఎంఈఓ అనిల్‌కుమార్‌గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు.. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయా తరగతుల విద్యార్థుల వద్దకు వెళ్లి పాఠ్యంశాలను చదివించారు. ఎప్పటి పాఠ్యంశాలను అప్పుడే చదివితే పరీక్షలో మంచి ఫలితాలను సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. అలాగే కాట్రేవ్‌పల్లిలో ఎస్–1 పరీక్షలు నిర్వహించడంపై తనిఖీలు చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సిరెడ్డి, లక్ష్మన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డా. విజయ్‌కుమార్

మక్తల్: సేంద్రియ ఎరువులు వాడి వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించవచ్చని విశ్రాంత డీఈఓ డా. విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం అచ్చంపేట నుంచి 21వ రోజు పాదయాత్రను కొనసాగించారు. ఈ మేరకు.. ఆయనకు గ్రామంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు స్వాగతం పలికారు.. అనంతరం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి మాట్లాడారు.. గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింసా మార్గాలు ఎల్లప్పుడు అనుసరణీయమన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అందరం అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భూదానం సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు గణేష్‌కుమార్, డాక్టర్ మణికంఠ, కట్టసురేష్, రవికుమార్, గొల్లపల్లి నారాయణ, చంద్రకాంత్‌గౌడ్, రమేష్, గోపాలం, భాస్కర్ పాల్గొన్నారు.

సివిల్ జడ్జికి ఆత్మీయ వీడ్కోలు



జడ్జిలను సన్మానిస్తున్న న్యాయవాదులు

నారాయణపేట: పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్‌లో మంగళవారం బదిలీ అయిన జడ్జికి న్యాయవాదులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్ నిర్మల్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయనను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే సీనియర్ సివిల్ జడ్జిగా ఇక్కడికి వచ్చిన వింధ్యానాయక్‌ను సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్జి జాకియా సుల్తానా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, న్యాయవాదులు మనోహర్ రెడ్డి, డి.వెంకట్ రెడ్డి, నారాయణ, సతీష్ గౌడ్, నర్సింహులు, కుర్మన్న, నాగేశ్వరి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

మాగనూర్: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని మందిపల్లిలో రైతువేదిక వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఆయన వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. అధికారులే ధాన్యం కొనుగోలు చేసే కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వనితకుమార్, ఏఈఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వడ్వాట్‌లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పార్క్, పల్లెప్రకృతి ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు రాకుండా పంచాయతీ సిబ్బంది పనిచేసేలా పంచాయతీ కార్యదర్శి చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం మంగళవారం ఆర్డీఓ మదుమోహన్‌రావు స్థలం పరిశీలించారు. గున్ముక్ల శివారులోని సర్వేనంబర్ 358లో 25 ఎకరాల స్థలం ఉందని మండల రెవెన్యూ అధికారులు ఆర్డీఓకు చూపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధుజా, ఆర్ఐ మల్లేష్, సర్వేయర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



అమరచింతలో రోడ్లు శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

గడ్డి మొక్కల తొలగింపు

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నురుల్‌నదీం అన్నారు. వారు మంగళవారం పట్టణంలోని తొమ్మిదో వార్డులోని పర్యటించి ఏపుగా పెరుగుతున్న గడ్డి పొదలను తొలగించి, తాగునీటి కుళాయిల వద్ద పరిసరాలను శుభ్రపరిచారు.

నందిమళ్లలో స్వచ్ఛ భారత్

మండలంలోని నందిమళ్లలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా నవయువ చైతన్యం యవజన సంఘం ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు గ్రామంలోని ఆయా వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రపరిచారు. చేతిపంపుల వద్ద ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించారు. . స్వచ్ఛ భారత్ కిడ్స్‌లో భాగంగా డైరీలు, టోపీలు, పెన్నులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు ముని, అంజి, శ్రీను, మణివర్ధన్, శ్రీకాంత్, సంజీవ, గోవిందు పాల్గొన్నారు.